క్లుప్తంగా

కళాశాలలో శ్రమదానం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

పెనుకొండ: విద్యతో పాటు సామాజిక సేవ చేయడం అలవర్చుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించారు. పరిసరాలను శుభ్రం చేశారు. సామాజిక బాధ్యత ఎంతో అవసరమన్నారు. గ్రామీణ ప్రాంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లిలో సెప్టెంబర్ 20న దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో సీపీఐ, సీపీఎంఎల్ ద్వారా ఏర్పడిన నిజ నిర్ధారణ కమిటీ పర్యటించింది. బాధితులతో వారు మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, ఖాశీం, చాంద్ బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత దివ్యాంగ క్రికెటర్‌కు ఆర్థికసాయం



వసంత్‌కుమార్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: భారత దివ్యాంగుల క్రికెట్ టీం కెప్టెన్ వసంత్‌కుమార్‌కు బంగ్లాదేశ్‌లో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప, విద్యార్థులు రూ.18 వేల ఆర్థికసాయం అందజేశారు. హౌసింగ్ బోర్డ్ కాలనీకు చెందిన వసంత్‌కుమార్ అక్టోబర్ 12 నుంచి 18 వరకూ బంగ్లాదేశ్‌లో యునైటెడ్ గోల్డెన్ సిటిజెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియా, బంగ్లాదేశ్ మధ్య జరిగే టీ–20, వన్డే ఇంటర్‌నేషనల్ దివ్యాంగుల టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. బంగ్లాదేశ్ టూర్ వెళ్లడానికి తమ వంతుగా కళాశాల తరఫున సహకారం అందించినట్లు వెల్లడించారు. బంగ్లాదేశ్ టూర్‌కు వెళ్లేందుకు దాతలు ఆర్థికంగా సహకారాలు అందించాలని క్రికెటర్ వసంత్‌కుమార్ కోరారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగి రాజేష్

పావగడ: తాలూకాలోని జోడి అచ్చమ్మన హళ్లిలో విద్యుదాఘాతంతో బెస్కాం ఉద్యోగి రాజేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామం రోడ్డు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న క్రమంలో రాజేష్ అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురికావడంతో కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడ్ని తోటి ఉద్యోగుల వెంటనే చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే విద్యుత్ ప్రమాద సంఘటన చోటు చేసుకున్న స్తంభం వద్ద ఇది వరకే పలు సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. మూగ జీవాలు సైతం మృతి చెందాయని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, విద్యుత్ కాంట్రాక్టర్లు స్పందించి విద్యుత్ స్తంభాలపై మరమ్మతులు చేపట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఆర్.మరువపల్లిలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

రొద్దం: ప్రతి గర్భిణి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ శాంత లక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఆర్ మరువపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో పోషణ మసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లులే కాకుండా జన్మించే బిడ్డలు ఆరోగ్యంగా జన్మిస్తారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనతచారి, మండల స్పెషలాఫీసర్, పీడీ నరసయ్య, ఈఓఆర్డీ కేశవరెడ్డి, అంగన్‌వాడీ వర్కులు, గర్భిణులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష



మడకశిర: క్యాంపులో రోగిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పెనుకొండ రూరల్: మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



చిలమత్తూరు: కళ్లద్దాలు పెడుతున్న పార్టీ సమన్వయకర్త దీపిక

పెనుకొండ రూరల్: ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించి, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మునిమడుగులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభించారు. గత ఇరవై రోజులగా వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేశారన్నారు. స్పెషలిస్టు వైద్యులతో ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉచితంగా 105 రకాల మందులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ అశ్వర్థనారాయణ, వైస్ ఎంపీపీ చంద్రకళ, నాయకుడు నీరుగంటి వెంకటరాముడు పాల్గొన్నారు.

మడకశిర/గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నదని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం మడకశిర పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాల ఆవరణ, గుడిబండ మండలం కే.ఎన్.పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్యాంపులు 45 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. 172 రకాల మందులను ప్రభుత్వం ఈ క్యాంపుల్లో పేదలకు అందుబాటులో ఉంచిందని వెల్లడించారు. ఆయా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మంజువాణి, నోడల్ ఆఫీసర్ క్రిష్ణానాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు, తహసీల్దార్ ముర్షావలి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్ శివకుమార్ పాల్గొన్నారు.

హిందూపురం/లేపాక్షి/చిలమత్తూరు: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక తెలిపారు. శనివారం లేపాక్షి మండలం చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హిందూపురం పట్టణ పరిధిలోని ముదిరెడ్డిపల్లి అర్బన్ హెల్త్ సెంటర్, చిలమత్తూరు మండలం వీరాపురంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని సౌకర్యాలతో ఆరోగ్య క్యాంపులు చేపట్టడం జరిగిందన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి కార్యక్రమాన్ని ఎవ్వరూ చేపట్టలేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, కౌన్సిలర్లు జయప్ప, రాధమ్మ, రామచంద్ర, మల్లికార్జున్, రోషన్ అలీ, వైఎస్సార్‌సీపీ పట్టణ ఏ, బీ బ్లాక్ కన్వీనర్లు సీఎం సాదిక్, లేపాక్షి మండలం వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వైద్యాధికారి నికేష్, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం: తమ్మడేపల్లిలో వైద్య పరీక్షల కోసం వృద్ధురాలిని తీసుకొస్తున్న ఆశాకార్యకర్త



రొళ్ల: రత్నగిరిలో అనారోగ్య సమస్యలు తెలుసుంటున్న వైద్య సిబ్బంది

గోరంట్ల: మండల పరిధిలోని కొండాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా పంచాయితీ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాతే జయరాం నాయక్ అధికారులతో కలసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కవిత, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్, వైస్ ఎంపీపీ నాగరాజు, ఈఓఆర్డీ క్రిష్ణప్ప పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి సచివాలయం–1 పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ గిరిజమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మడకశిరరూరల్/అగళి/రొద్దం/సోమందేపల్లి/పరిగి: ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించినట్లు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమాల్లో మడకశిర ఎంపీపీ కవిత తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మలేరియా యూనిట్ జిల్లా అధికారి కుళ్ళాయప్ప నాయక్, రొద్దం ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి నరసయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ

పరిగి: మరో మూడు దశాబ్దాలు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 11 నుంచి నవంబర్ 30 వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహించబోయే ఏపీకి ఎందుకు జగనన్నే కావాలి నినాదంతో కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ లబ్ధి పొందిన వారి వివరాలను ప్రత్యేకంగా ప్రదర్శించాలన్నారు. అనంతరం ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించాలన్నారు. నవంబర్ 30 వరకూ ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రజాప్రతినిధులంతా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ లబ్ధితో పాటూ అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఇందులో మండల స్థాయి నాయకులతో పాటూ క్షేత్రస్థాయిలో గృహసారథులు, వలంటీర్లు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగున్నరేళ్ల కాలంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చారని స్పష్టం చేశారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనని అనేక అంశాలను సంక్షేమ పథకాలుగా అందించిన ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవ్వరూ లేరన్నారు. రానున్న రోజులు మనకెంతో కీలకమని, ప్రతి ఒక్కరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, మాజీ కన్వీనర్ జయరాం, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కోఆప్షన్ మెంబర్ సలీం, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నిరసనలతో ఒరిగేది శూన్యం

• ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును ప్రజలు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టీడీపీ కార్యకర్తలు చేసే నిరసన కార్యక్రమాల వలన ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కించపరిచేలా మాట్లాడితే సహించమని హెచ్చరించారు. చంద్రబాబు అవినీతి చేసినట్లు ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని తెలిపారు. ఈ కారణంగానే రాష్ట్రంలో చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజలు పెద్దగా స్పందించ లేదన్నారు. ఎక్కడా కూడా గొడవలు, అల్లర్లు, విధ్వంసాలు జరగలేదన్నారు. అన్ని ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా చంద్రబాబు అవినీతి చేసినట్లు నమ్మిందన్నారు. ఈ విషయంలో ఎక్కడా కూడా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదన్నారు.

కుళాయి అక్రమ కనెక్షన్ల తొలగింపునకు చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్

పెనుకొండ: నగర పంచాయితీ పరిధిలో అనుమతులు లేకుండా తీసుకున్న కుళాయి అక్రమ కనెక్షన్లను తొలగించేందుకు సత్వర చర్యలు చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయంలో శనివారం నగర పంచాయితీ అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ అధ్యక్షతన జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ.. పెనుకొండతో పాటు, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, మంగాపురం, కోనాపురం, కొండాపురం గ్రామాల్లో గతంలో అనేక మంది అక్రమ కుళాయి కనెక్షన్లు తీసుకున్నారన్నారు. నగర పంచాయతీగా రూపాంతరం చెందిన అనంతరం తగిన రుసుము చెల్లించి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పినా స్పందించ లేదని తెలిపారు. కుళాయి కనెక్షన్ల తొలగింపునకు ఆమోదించారు. చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ.. ఊరువాకిలి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పూల మార్కెట్‌కు డాక్టర్ వైఎస్సార్ పేరు పెడుతున్నట్లు పేర్కొనగా సభ్యులు అంగీకరించారు. దీనిని ఆధునీకరించి పూల వ్యాపారులకు లీజుకు, లేదా బాడుగకు ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలో కృష్ణదేవరాయ సర్కిల్ పూల వ్యాపారులను పూల మార్కెట్ వద్దకు తరలించడం జరుగుతుందన్నారు. శానిటేషన్ నిర్వహణ, పారిశుధ్య కార్మికుల నియామకం, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటికి వెచ్చించాల్సిన నిధుల గురించి సమావేశంలో చర్చించారు. తమ వార్డుకు సక్రమంగా నీటి సరఫరా కావడం లేదని కౌన్సిలర్ సుధాకరరెడ్డి తెలిపారు. అదనంగా గంట పాటు సమయం పెంచుతామని కమిషనర్ హామీ ఇచ్చారు. వైస్ చైర్మెన్లు నందిని, సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, తయూబ్, సద్దాం, సుధాకరరెడ్డి, ఫరిజియా భాను, షహనాబీ, శేషాద్రి, గిరి, నాగరత్న, చంద్రకళ, బోయ హారతి, లావణ్య, అంజలి, గీత, రామాంజనేయులు, సంజీవమ్మ, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి



చంద్రబాబు పోస్టర్లను చించి వేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మెన్లు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

హిందూపురం: సీజనల్ వ్యాధులు పెరుగుతున్న తరుణంలో పారిశుధ్యం మెరుగు పరిచి శుభ్రత చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. శనివారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎనిమిది అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించారు. 28వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ.. వార్డులో పాతకాలం నాటి విద్యుత్తు స్తంభాలను మార్చాలని కోరారు. కౌన్సిలర్ రోషన్ మాట్లాడుతూ.. చెత్తను తొలగించేందుకు పుష్కార్టులకు మరమ్మతులు చేయించాలన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వాహణ అస్తవ్యస్తంగా మారుతోందని మురుగుకాల్వలు శుభ్రం చేయకుండా, షిల్ట్ తరలిచడం లేదని కౌన్సిలర్లు గిరిష్, నాసిరాబాను విమర్శించారు. మున్సిపల్ సిబ్బంది ఎక్కడ ఫాగింగ్ చేస్తున్నారో తెలియడం లేదన్నారు. ప్రజాధనం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ దోమల బెడద, మురుగు మెరుగుపడటం లేదన్నారు. పట్టణంలో గ్యాస్ నిర్వాహణకు ఓ కంపెనీ అన్ని రహదారులను తవ్వేసి మట్టి పూడ్చేసి వదిలేస్తున్నారన్నారు. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. స్పందించిన చైర్‌పర్సన్ సంబంధిత కంపెనీకి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

పబ్లిసిటీ కోసమే టీడీపీ నిరసన

కౌన్సిల్ ప్రారంభంలో టీడీపీ కౌన్సిలర్లు నల్లదుస్తులతో హాజరై చైర్‌పర్సన్ పోడియం వద్ద నినాదాలు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కూడా వారికి దీటుగా చంద్రబాబు దొంగ అంటూ నినాదాలు చేపట్టారు. టిడిపి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల నిరసన నినాదాలతో కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. సమస్యలపై చర్చించకుండా టీడీపీ కౌన్సిలర్లు వాగ్వాదం చేయడం సరికాదని చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. అయినా టీడీపీ కౌన్సిలర్లు పెడచెవిన పెడుతూ దూసుకువచ్చి నినాదాలు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రతిస్పందిస్తూ టీడీపీ కౌన్సిలర్ల పోస్టర్లు చించివేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు అండ్‌కో ప్రజాధానాన్ని లూటీ చేశారని వైస్ చైర్మెన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్న చంద్రబాబును అన్ని ఆధారాలతో సీబీఐ అరెస్టు చేసిందన్నారు. విచారణ చేస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు, టీడీపీ కౌన్సిలర్లు నిరసన చేపట్టడం దుర్మార్గమన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య



వినాయకుడి శోభాయాత్ర..

అమరాపురం: మండల కేంద్రంలో కొలువుదీరిన వరసిద్ధి వినాయక, లంబోదరులు 13 రోజుల పూజల తరువాత శనివారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. తొలుత గణపయ్యలను ప్రత్యేక పూలతో అలంకరించి రథంలో కొలువుదీర్చిన అర్చకులు పూజలు చేసి శోభయాత్రను ప్రారంభించారు. జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అంటూ యువత నినాదాలు చేశారు. తోలుబొమ్మలతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వ్యవసాయ బావి, చెరువులో గణపయ్యలను నిమజ్జనం చేశారు.



దప్పుచప్పుళ్ల మధ్య యువత సందడి



నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

పావగడ: ఉపాధిహామీ (నరేగా) పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈఓ జానకీరాం సూచించారు. తాలూకాలోని సొసలకుంట, వదనకల్లు గ్రామ పంచాయతీల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామస్తులకు నరేగా పనులకు సంబంధించిన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. రైతులు, భూస్వాముల వ్యవసాయ భూములు, తోటల్లో గట్లు నిర్మించడం, మామిడి, టెంకాయ, డ్రాగన్ పండ్లు, పప్పాయి, అరటి తదితర మల్బరి పంటల సాగుకు నరేగా యోజన నుంచి కూలి డబ్బులు ఇస్తామన్నారు. అంతే కాకుండా నరేగా యోజన నుంచి పాఠశాల ప్రహరీ, వంట గది నిర్మాణాలు, మరుగు దొడ్లు, అంగనవాడీ భవన నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు, సంజీవిని షెడ్లు, ఉద్యానవన నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రంగనాథ్ తదితర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి చండీహోమం

పెనుకొండ: చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని జరిగే ప్రత్యేక చండీహోమం, ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనాలని శక్తిపీఠం వ్యవస్థాపకుడు దేవేంద్రస్వామి కోరారు. శనివారం పట్టణంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద పూజలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి 23 వరకూ హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం

లేపాక్షి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ–మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రెడ్డిరమణమ్మ మాట్లాడుతూ.. తల్లీబిడ్డల సంక్షేమమే ఐసీడీఎస్ లక్ష్యమన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, సూపర్‌వైజర్లు జయమ్మ, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర సబ్ రిజిస్ట్రార్‌గా దామోదర్

మడకశిర: మడకశిర సబ్ రిజిస్ట్రార్‌గా దామోదర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా మడకశిర రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ పోస్ట్ ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా కొనసాగారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించింది. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్‌గా దామోదర్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైన రాహుల్‌ను అభినందించిన ఉపాధ్యాయులు

గోరంట్ల: ఇటీవల అనంతపురం జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి రాహుల్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పెనుకొండ నియోజకవర్గ జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. ఉత్తమ ఆటతీరు కనబరిచిన రాహుల్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ రమోహన్, ఉపాధ్యాయులు, శివా నాయక్, సుధాకర్‌రెడ్డి, పక్కీర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు సన్మానం

పావగడ: మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించి సుమారు 70 యూనిట్ల రక్తాన్ని సేకరించిన స్థానిక నవ జవాన్ కమిటీ సభ్యులను శనివారం స్థానిక మున్సిపల్ మాజీ నామిని కౌన్సిలర్ రిజ్వాన్ ఉల్లా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన శిబిరం నిర్వహించడమే కాకుండా పేదలకు నిత్యావసర కిట్లు అందించడం హర్షణీయమని తెలిపారు. నవ జవాన్ కమిటీ సభ్యుల సామాజిక సేవలను గుర్తించి సన్మానించడం జరిగిందన్నారు. నవ జవాన్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఆర్ రియాజ్ తదితర పదాధికారులు సన్మానం అందుకున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై నాటిక ప్రదర్శిస్తున్న ఆర్డీటీ కళాకారులు

పెనుకొండ: పట్టణంలోని గిరిజన బాలికల పాఠశాలలో శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై కళాకారులు నాటికను ప్రదర్శించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు పాటలు పాడుతూ ప్రత్యక్ష అభినయంతో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మార్పు రావాలి అన్న పేరుతో కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చేయూత



క్రీడా దుస్తులు అందజేస్తున్న రెడ్డి జేఏసీ సభ్యులు

హిందూపురం టౌన్: సౌత్ జోన్ పెంకాక్ సిలాట్ యుద్ధ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు రెడ్డి జేఏసీ సభ్యులు చేయూతనందించారు. శనివారం పట్టణంలోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో హిందూపురం, పరిగి మండలాలకు చెందిన ఏడుగురు క్రీడాకారులకు రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి చేతుల మీదుగా క్రీడా దుస్తులు అందజేశారు. కేరళలోని తిరువనంతపురంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు మన ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ఎంపిక కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు నరసింహారెడ్డి, స్పోర్ట్స్ ట్రైనర్ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.